సేవలకు చంద్రగ్రహణం

- కళ తప్పుతున్న సచివాలయాలు
- గతంతో పోలిస్తే 75 శాతం సేవలు కట్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెదపూడిలో గ్రామ సచివాలయం-1

పెదపూడి: గ్రామీణులు ఏ చిన్న పని కావాలన్నా మండల కేంద్రం, జిల్లా కేంద్రానికో పరుగులు తీయాల్సి వచ్చేది. ఇతర పనులకు ఇబ్బందులు ఎదురయ్యేది. పైగా సదరు సమస్యపై రోజుల కొద్దీ కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఈ విషయాన్ని గ్రహించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రభుత్వ సేవలు గ్రామ స్థాయిలోనే అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి రెండు వేల కుటుంబాలకు ఓ సచివాలయం ఉండేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలో పది మంది శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రైతులు, గ్రామీణుల సమస్యల పరిష్కారం కోసం సుమారు 542 రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి రోజు గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సచివాలయాల ద్వారా పొందేవారు. సంక్షేమ పథకాలు అందించడంలో ఈ వ్యవస్థ క్రియాశీలకంగా వ్యవహరించింది.

నిర్లక్ష్యానికి గురై..

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజా సేవలకు పేరొందిన సచివాలయాలు 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్లక్ష్యానికి గురయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సచివాలయాలకు అనుసంధానంగా ఉన్న వలంటీర్ వ్యవస్థ ఉనికి లేకుండా చేసింది. అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేల జీతం ఇస్తామని చెప్పి ప్రభుత్వం ఏర్పడ్డాక మాట తప్పారు. నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 58 గ్రామాలు ఉన్నాయి. వీటిలో సుమారు 79 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సుమారు 700 మంది సచివాలయం ఉద్యోగులు పని చేస్తున్నారు.

పనిభారం మోపి..

ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ద్వారా వలంటీర్ల చేయాల్సిన పింఛన్లు పంపిణీ, సర్వేలు చేయిస్తున్నారు. ఇలా సచివాలయ ఉద్యోగులపై పని భారం మోపుతున్నారు. కానీ ప్రజలకు అందించే సేవలు వారి ద్వారా ప్రజలకు అందడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల ద్వారా అందించే సేవల్లో సుమారు 75 శాతం మేర సేవలు కూటమి ప్రభుత్వం ఏర్పటయ్యాక అందకుండా చేసింది. ముఖ్యంగా నూతన పింఛన్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు మొదలగు సేవలకు ఆటంకం ఏర్పడింది. అలాగే వాటికి దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలకు వెళ్తే సర్వర్ పని చేయడం లేదని అధికారులు చెబుతుండటంతో ప్రజలు వెనుతిరుగుతున్నారు. ఇప్పటికైనా సచివాలయ సేవలను గతంలో అందించినట్లుగానే అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మండలం	గ్రామాలు	సచివాలయాలు
అనపర్తి	11	19
బిక్కవోలు	13	21
పెదపూడి	18	20
రంగంపేట	16	19
మొత్తం	58	79

సేవలు కొనసాగించండి



సచివాలయాలు లేక ముందు చిన్న సర్టిఫికెట్ కావాలన్నా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లోనే చాలా వరకూ ప్రభుత్వ సేవలను అందుకున్నాం. గతంలోలాగే కూటమి ప్రభుత్వం కూడా సచివాలయాల్లో సేవలు అందించాలని కోరుతున్నాం.

– ఎస్.పద్మావతి, పెదపూడి

అందుబాటులోకి తేవాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉన్నటు వంటి గ్రామ సచివాలయ సేవలను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలి. దాంతో ప్రజలకు సచివాలయాలు సేవలు అందడంతో పాటు ఇబ్బందులు తప్పుతాయి. అప్పుడే ఎలాంటి సమస్యలు ఉండవు.

– పి.సంధ్య, కాండ్రేగుల

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ


రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్టులో ప్రతిభ చాటిన విద్యార్థులతో హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అన్నారు. మంగళవారం స్థానిక హైస్కూల్లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న రామచంద్రపురం రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో ఆన్‌లైన్ ద్వారా 100 ప్రాజెక్టులు రాగా ఐదు ఉత్తమ ప్రాజెక్టులు ఎంపికయ్యాయని అన్నారు. వాటిలో రంగంపేట హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎ.రమ్య, జె.సీతామహాలక్ష్మి రూపొందించిన సెక్యూరిటీ అలెర్ట్ డోర్ బెల్ ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైందన్నారు. ఈ ప్రాజెక్టుకు పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ గైడ్ టీచర్‌గా వ్యవహరించారు. అలాగే టీచర్ ఎగ్జిబిట్ కేటగిరీలో రమ్యసుధ రూపొందించిన స్టూడెంట్ ఫ్రెండ్లీ పెన్ విత్ కాన్సన్‌ట్రేషన్ డిటెక్టర్ ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక అయ్యిందన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే సైన్స్ పోటీల్లో రమ్యసుధ తన ప్రత్యేకతను కనబరుస్తూ బహుమతులు సాధిస్తున్నారని అభినందించారు. మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, సీఆర్ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల యోగక్షేమాలపై సర్వే


బాలవరంలో ఇంటింటా సర్వే చేస్తున్న బృంద సభ్యులు

రంగంపేట: దివ్యాంగుల యోగక్షేమాలపై ఇంటింటా సర్వే చేపట్టినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవాది మడికి రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు నల్సావారి ఆదేశాల మేరకు పెద్దాపురం కోర్టు 7వ జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి.చంద్రమౌళేశ్వరి ఆదేశాలతో ఈ సర్వే చేస్తున్నామన్నారు. న్యాయశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎం, వైద్యాధికారులు తదితర 14 మంది సభ్యులతో టీమ్ ఏర్పాటు చేశామని అన్నారు. ఇందులో భాగంగా టీమ్ సభ్యులు జి.దొంతమూరు, బాలవరం గ్రామాల్లో ఇంటింటా సర్వే చేశారన్నారు. దివ్యాంగుల యోగక్షేమాలు, వారికి అందుతున్న వైద్యం, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని సదరమ్ సర్టిఫికెట్లు వచ్చాయా లేదా, బాల్య వివాహాలు జరగకుండా ఉండేలా, వాటివల్ల కలిగే అనర్థాలు, శిక్షల గురించి తెలియజేశామన్నారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించామన్నారు. ఈ సర్వే నివేదిక కోర్టుకు సమర్పిస్తామని అన్నారు. న్యాయవాది మడికి రాంబాబు, డాక్టర్ విజయవర్ధిని, పీఎల్‌వీలు నూతలపాటి అప్పలకొండ, డి.విజయ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలను తిప్పికొడతాం

- దాడిశెట్టి రాజాపై దాడి దారుణం
- వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ గణేష్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్


నిరసన తెలియజేస్తున్న జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం సిటీ: కాకినాడ జిల్లా తునిలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజాపై టీడీపీ శ్రేణులు దాడి చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజాపై దాడికి నిరసనగా చలో తుని కార్యక్రమానికి పిలుపునివ్వడంతో జక్కంపూడి గణేష్‌ను పోలీసులు తుని వెళ్లకుండా అడ్డుకున్నారు. స్థానిక జేఎన్ రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మీడియాతో మాట్లాడుతూ తుని మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలనే ఉద్దేశంతో టీడీపీ అక్రమాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఎన్ని రకాలుగా వైఎస్సార్ సీపీ శ్రేణుల్ని భయపెట్టాలని చూసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. టీడీపీకి మెజార్టీ లేకపోయినా వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలని దురాలోచన చేయడం సరికాదన్నారు. కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి ఇబ్బంది పెట్టి లాక్కోవాలని ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు రక్షణ కల్పించకుండా అధికార యంత్రాంగం, పోలీసులు వ్యవహరించడంపై మండిపడ్డారు. తిరిగి తప్పుడు మార్గంలో దాడిశెట్టి రాజాపైనే కేసులు నమోదు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దాడిశెట్టి రాజా తునికి మాత్రమే పరిమితం కాదని, ఉభయ గోదావరి జిల్లాల్లో ఆయన అనుచరులు, అభిమానులు చాలామంది ఉన్నారన్నారు. జరుగుతున్న పరిణామాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తేవడానికి కృషి చేస్తామన్నారు. తమను పార్టీ నుంచి దూరం చేయాలనే ఆలోచన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని, దీనికి ప్రజలే సరైన సమయంలో సమాధానం చెబుతారన్నారు. పోలీసులు కూడా టీడీపీ కార్యకర్తల్లా విధులు నిర్వహించడంపై ఆలోచన చేసుకోవాలన్నారు. తమకు ఒకరోజు వస్తుందని అప్పుడు గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు అరుణ్ జేకే, రాయుడు రాకేష్, అడపా అనిల్, కోడి కోట, తగరం సోము, నల్లం రాజేష్, గొట్టిముక్కల రాజు, బాలాజీ రెడ్డి, కురుమెళ్లి స్వరూప్ తదితరులు ఉన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యను బలోపేతం చేద్దాం


బిక్కవోలులో శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్


రంగంపేట హైస్కూల్‌లో మాట్లాడుతున్న విజయకుమారి

రంగంపేట: బాలల సంరక్షణ, ప్రీ ప్రైమరీ విద్యను బలోపేతం చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తల్లో వృత్తి నైపుణ్యం పెంచడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు జిల్లా మహిళా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయకుమారి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్ వి.పార్థసారథి అధ్యక్షతన జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల ఆరు రోజుల శిక్షణ తరగతులకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని ఆమె కోరారు. తల్లిదండ్రులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని, ఐసీడీఎస్ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని ఆమె కోరారు. ఈ తరగతుల్లో డీఆర్పీలు ఎన్‌వీ రమణాంజలి, కె.రాజు, వి.త్రిమూర్తిరాజులు పిల్లల మెదడు అభివృద్ధిని ప్రభావితం చేసే అంశాలు, లక్ష్యాలు, వాటి సాధన, కృత్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతకుముందు ఈ శిక్షణ తరగతులను తహసీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీఓ వి.వీరసాయిబాబు, మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీఓ జె.జెస్సీ ఫ్లోరెన్స్ ప్రారంభించారు.

పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దండి

బిక్కవోలు: పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతిపై శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. 66 మంది ఐసీడీఎస్ కార్యకర్తలకు బిక్కవోలు, ఊలపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. 20 తేదీ వరకు ఒక విడతగా 22 నుంచి 25 వరకూ రెండో విడతగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఇకపై అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేస్తూ, వాటిలోని బాలల విద్యతో ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్‌వీ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బిక్కవోలు ఏవీ కృష్ణకుమారి, ఊలపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ శాంతి రత్నకుమారి, బిక్కవోలు హెచ్ఎం పల్లా ప్రభాకర్, ఊలపల్లి హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పెదపూడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యనందించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల పాటు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని మండల విద్యాశాఖ -1, 2 కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ అన్నారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు సాల్ట్ కార్యక్రమం ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రపంచ బ్యాంక్, ఎస్ఎస్ఏ, ఎస్‌సీఈఆర్‌టీ, సౌజన్యంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సహకారంతో నిర్వహిస్తున్నారన్నారు. దీనిని అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శ్రీ పద్మ, శ్రీగౌరీ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) కార్యక్రమం అమలులో భాగంగా మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు ఆట, పాటలతో విద్యను అందించే విషయమై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ ఉంటుందని ఎంఈఓ-1 రామన్నదొర తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఈ శిక్షణకు ఆర్పీలుగా ఉపాధ్యాయులు గోవిందకుమారి, సుమలత, రమేష్, షేక్‌షామ్ సుజమలు వ్యవహరిస్తారు. ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి, ఎంఈఓ- 2 జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: స్థానిక కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మాఘ మాసం షష్ఠి కలసి రావడంతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

నడక మార్గం ఏర్పాటుకు చర్యలు

సీతానగరం: మహా శివరాత్రి సందర్భంగా వంగలపూడి రేవు నుంచి ఏలూరు జిల్లా పట్టిసీమ వీరభద్రుడి దర్శనానికి వెళ్లే భక్తులకు నడక మార్గం ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధ్యక్షతన మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఉత్సవ కమిటీ సమావేశంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్నచౌదరి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీఓ ఎం.భారతి, ఎస్సై డి.రామ్‌కుమార్ పాల్గొన్నారు. వంగలపూడి రేవు నుంచి వెళ్లే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, పలు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈఓపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, విద్యుత్ శాఖ ఏఈ చంద్రమోహన్, పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


ఊలపల్లిలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ గొడపర్తి సత్యనారాయణ మూర్తి నేత్ర వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఇందులో వైద్యులు 92 మందికి పరీక్షలు చేసి, 25 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఆరుగురికి శస్త్రచికిత్సలు చేయాలని సిఫార్సు గుర్తించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్చియ్య చౌదరి, బిక్కవోలు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు


యూత్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న జి.మామిడాడ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రాజారెడ్డి

పెదపూడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ మల్టిపుల్ 316బీలో యూత్ సర్వీసెస్ ప్రోగ్రామ్‌లో 2024–25 సంవత్సరానికిగాను ఉత్తమ సేవలు అందించినందుకు జి.మామిడాడ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్యకు రాష్ట్ర స్థాయి ఉత్తమ క్లబ్ అవార్డు లభించిందని ఆ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మండ రాజారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజయవాడలో లయన్స్ సర్వీస్ సెంటర్ వద్ద మంగళవారం జరిగిన సేవా యజ్ఞం కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ శాంతి, లయన్స్ ఇంటర్నేషనల్ 3వ ఉపాధ్యక్షులు ఎండార్సీ, విజయకుమార్‌రాజు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ చిగురుపాటి శంకర్, 316బీ గవర్నర్ ఈశ్వర్ కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నానన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డు తమ క్లబ్‌కు లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అవార్డు రావడంపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పూర్వపు గవర్నర్ బాదం బాలకృష్ణ ప్రత్యేక అభినందనలు తెలిపారు. సభ్యులు బ్రహ్మానందరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పట్టపగలే వెన్నెల


ముగ్గళ్లలో పగలు వెలుగుతున్న వీధి దీపం

సీతానగరం: మండలంలోని ముగ్గళ్లలో పట్టపగలు విద్యుత్ దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఇది నిరంతరం వెలుగుతున్నాయి. ముగ్గళ్ల సత్రం రోడ్డులో విద్యుత్ స్తంభాలకు అమర్చిన దీపాలు ఉదయం 11 గంటలైన అలాగే కాంతినిస్తున్నాయి. ఇప్పటికే పంచాయతీపై విద్యుత్ బిల్లుల భారం పడుతోంది. అయినా అధికారులు అనవసర వెలుగులను ఆపేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వైఎస్సార్ సీపీ నాయకులకు నోటీసులు


దుర్గారావుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

మధురపూడి: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాపై దాడిని నిరసిస్తూ తునికి కోరుకొండ నుంచి బయలు దేరడానికి సిద్ధమైన నాయకులకు మంగళవారం పోలీసులు నోటీసులు ఇచ్చారు. మండలంలోని 9 మందికి నోటీసులు అందజేశారు. తుని వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. ఈ కుట్రను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన కార్యక్రమానికి వెళ్లకుండా జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నాయకులు కొండపల్లి దుర్గారావు, బొర్సు బద్రినారాయణ, చాటపర్తి దుర్గారావు, పసుపులేటి బుల్లియ్య నాయుడు తదితరులకు నోటీసులు ఇచ్చారు.

రక్షణా.. అదెక్కడ!


కోరుకొండ బస్టాండ్ సెంటర్ వద్ద ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతం

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ పక్కన మలుపు వద్ద వంతెన ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఇక్కడ రక్షణ గోడ లేక ప్రయాణం దినదిన గండమైంది. ఇక్కడ రాత్రి వేళల్లో పొరపాటున కాలుజారితే కాలువలోకి వెళ్లాల్సిందే. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలలకు పోడియంలు



రాజానగరం ఉన్నత పాఠశాలకు అందజేసిన పోడియం వద్ద మాట్లాడుతున్న అధికారులు

రాజానగరం: విద్యార్థులలో స్టేజ్ ఫియర్ తొలగించి, మంచి స్పీకర్లుగా తయారయ్యేందుకు పోడియంలు ఉపయోగపడతాయని ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్ అన్నారు. స్థానిక విద్యావేత్త బర్ల విజయ్ తమ సంస్థ ద్వారా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు మండలంలోని 17 ఉన్నత పాఠశాలలకు పోడియాలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో బర్ల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్ట్

రంగంపేట: సారాతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈలకొలను గ్రామంలో సారా తయారీ, విక్రయాలు జరుపుతున్న పిల్లి నాగబాబును అరెస్ట్ చేశామన్నారు. అతని నుంచి 20 లీటర్ల సారా, 200 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊట, రెండు అల్యూమినియం పాత్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్లపు ఊటను, అల్యూమినియం పాత్రలను ధ్వంసం చేసి, పిల్లి నాగబాబును రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

సాయుధ బలగాల కవాతు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యాన్యువల్ డీమొబలైజేషన్‌లో భాగంగా స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సాయుధ బలగాల కవాతు మంగళవారం నిర్వహించారు. దీనికి ఎస్పీ డి.నరసింహాకిశోర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సాయుధ బలగాల యాన్యువల్ డీమొబలైజేషన్ కవాతు వీక్షించి, గౌరవ వందనం స్వీకరించారు.